క్లుప్తంగా

జెండాలు పాతిన కేసులో అరెస్ట్.. విడుదల

సత్తుపల్లి: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే డిమాండ్‌తో కొద్దినెలల క్రితం కాంగ్రెస్ ఆధ్వర్యాన జెండాలు పాతిన కేసుకు సంబంధించి టీపీపీసీ అధికార ప్రతినిధి కోటూరి మానవతారాయ్‌ను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఆయనను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా మానవతారాయ్ మాట్లాడుతూ.. పోలీసులు ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు ఉద్యమిస్తామని తెలిపారు. కాగా, ఇదేఘటనలో గాదె చెన్నారావు, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కంభంపాటి కాంతారావు, ధనలక్ష్మి, మహ్మద్ ఫజల్ బాబా తదితరులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సత్తుపల్లి: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం సత్తుపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ కార్యా లయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు వి.సుశీల, పి.ఉదయశ్రీలు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు కనీస వేతనాలు ఇచ్చి రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాల విలీనాన్ని రద్దు చేయాలని కోరారు. అనంతరం కార్యాలయ ఉద్యోగి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.సర్వేశ్వరరావు, చంద్రశేఖర్, జీవమ్మ, లలిత, నాగేంద్ర, కమల, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీ రద్దు చేయాలి

బోనకల్: విద్యుత్ ఏసీడీ బిల్లులను రద్దు చేయాలని ఆళ్లపాడు గ్రామస్తులు శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మర్రి తిరుపతిరావు మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులు ఏసీడీ అదనపు బిల్లుల పేరుతో వేస్తున్న వాటిని చెల్లించవద్దన్నారు. బిల్లు కలెక్షన్ కోసం వచ్చిన అధికారులను గ్రామస్తులు నిలదీశారు. సాధారణంగా వచ్చే నెల బిల్లులను మాత్రమే చెల్లిస్తామని వినియోగదారులు తేల్చి చెప్పారు.

ఖాళీ స్థలంలో వెలసిన గుడిసెలు

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లి గ్రామానికి చెందిన ఇల్లులేని నిరుపేదలు ఎన్నో ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఎకరంన్నర స్థలంలో శుక్రవారం గుడిసెలు వేశారు. కాకర్లపల్లికి చెందిన రాయల పుష్పావతి, గిరి దంపతులకు చెందినదిగా గ్రామస్తులు తెలిపారు. అయితే ఇది ప్రభుత్వ భూమి అంటూ కొందరు నిరుపేదలు గుడిసెలు వేశారు. ప్రస్తుతం ఈ భూమిపై వివాదం ఉండటంతో హైకోర్టులో కేసు నడుస్తున్నట్లు తెలిసింది.

తహసీల్దార్‌కు సన్మానం

తల్లాడ: రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా ఉత్తమ తహసీల్దార్‌గా ఎంపికైన గంటా శ్రీలతను శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో అభినందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో తోటి సిబ్బందితో కలిసి ఆమెను అభినందించి స్వీట్లు పంపిణీ చేశారు. మండలంలోని ప్రజల కోసం ఆమె చేసిన కృషి మరువలేనిదని బీజేపీ మండలాధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణారావు పాల్గొన్నారు.

సోమలింగేశ్వర ఆలయంలో జీవన్‌లాల్ పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న జీవన్‌లాల్

ఏన్కూరు: మండలంలోని నూకలంపాడులో శ్రీశ్రీశ్రీ సోమలింగేశ్వరస్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో ఐఆర్‌యస్ జీవన్‌లాల్ శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఐఆర్ఎస్ జీవన్‌లాల్‌కు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ శేషయ్య, బీఆర్ఎస్ నాయకులు సురేష్‌నాయక్, ధర్మారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాదయాత్రకు సంఘీభావం



పూజల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

మధిర: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ నాయకుడు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు టీటీడీపీ సంఘీభావం తెలిపింది. యువగళం పాదయాత్రకు సంఘీభావంగా ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఆధ్వర్యంలో శుక్రవారం మధిర లోని శ్రీ లక్ష్మి పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు, నాయకులు చేకూరి శేఖర్ బాబు, కొండ, పగిడిపల్లి కాశీ రావు తదితరులు పాల్గొన్నారు.

పోడు గోడు పట్టదా?

- సర్వే పూర్తయినా జాప్యమెందుకు..
- హక్కు పత్రాల కోసం ఎదురుచూస్తున్న పోడుదారులు..



కారేపల్లి మండలంలో పోడు భూముల సర్వేలో పాల్గొన్న ఉద్యోగులు (ఫైల్)

కారేపల్లి: ఈసారైనా పోడుకు హక్కు పత్రాలు వస్తాయా..! మా దశాబ్దాల కల నెరవేరేనా..!! పోడు సర్వే పూర్తైనా.. ఇంకా హక్కు పత్రాలు ఇవ్వటంలో జాప్యమెందుకు అంటూ పోడుసాగుదారుల కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం 'పోడు సర్వే'చేయించి పోడు దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి అటవీ హక్కు పత్రాలు కల్పించాలని యోచించింది. దీనిలో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా.. పోడు సర్వే ప్రారంభమై, దశల వారిగా సర్వేను పూర్తి చేసి అర్హులైన వారిని సైతం గుర్తించే ప్రక్రియను పూర్తి చేశారు.

హక్కు పత్రాల కోసం ఎదురుచూపులు..

కారేపల్లి మండలంలోని బాజుమల్లాయిగూడెం, రేలకాయలపల్లి, మాణిక్యారం రెవిన్యూ పరిధిలో పాటిమీదిగుంపు, బాజుమల్లాయిగూడెం, చీమలపాడు, రేలకాయలపల్లి, మాణిక్యారం, ఎర్రబోడు, నానునగర్‌తండా, బోటితండా, జైత్రాంతండా, గేటురేలకాయలపల్లి, తవిసిబోడు గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 2వేల మంది గిరిజన రైతులు, సుమారు 15వేల ఎకరాల్లో పోడు వ్యవసాయం చేసుకుంటుండగా, వీరిలో 2005 అటవీహక్కుల చట్టం ద్వారా పోడు హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆనాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఇటు రెవెన్యూ అధికారుల, ఫారెస్టు అధికారులు ఎఫ్ఆర్‌సీ కమిటీ సమక్షంలో 1,613 మంది గిరిజన రైతులను అర్హులుగా గుర్తించింది. వీరికి 6,123 ఎకరాల పోడు భూమికి హక్కు కల్పిస్తు.. అటవీహక్కు పత్రాలను ఆనాటి ప్రభుత్వం అందజేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. వ్యవసాయ సీజన్‌లో ఫారెస్టు అధికారులు రైతులను పోడు భూముల్లోకి పోకుండా అడ్డుకోవటం, పోడు భూముల్లో బోర్లు వేసిన, కరెంట్ స్తంభాలు వేసిన వాటిని అడ్డుకోవటం, ఈ క్రమంలో పోడుదారులకు, ఫారెస్టు అధికారులకు మధ్య వాగ్వాదాలు జరగటం పరిపాటిగా మారింది. గత ఏడాది నానునగర్‌తండా గ్రామానికి చెందిన పోడు రైతుల భూముల్లో కరెంట్ స్తంభాలను ఫారెస్టు అధికారులు ధ్వంసం చేయటం.. పోడు రైతులు గిరిజన సంఘం, వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనల బాట పట్టడం తెలిసిందే. కారేపల్లి గ్రామంలో సైతం అటవీ శాఖ అధికారులు ఫారెస్టు చుట్టూ పిల్లర్లు వేస్తే.. వాటిని పోడు రైతులు ధ్వంసం చేయటం, పోడు దారుల పై కేసులు నమదోదు చేయటం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో సుమారు 15 రోజుల పాటు కారేపల్లి గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న సంగతులు తెలిసిందే. ఈ సారైనా పోడు సాగుచేసుకుంటున్న పోడుదారులకు హక్కు పత్రాలు ఇస్తారన్న ఆశతో పోడుదారుల కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి.

నిర్బంధాలు వీడేనా..!

తాతా ముత్తాతల నుంచి పోడు భూమినే నమ్ముకొని, సాగు చేసుకుంటూ.. బతుకుతున్న గిరిజన పోడుదారుల పై.. దశాబ్దాలుగా ఫారెస్టోళ్ల నిర్బంధాలు కొనసాగుతూనే ఉన్నాయి. పోడు లేకపోతే బతుకే లేదన్న గిరిజనులపై ఫారెస్ట్ అధికారులు దాడులు చేసి, కేసులు సైతం పెట్టిన దాఖలాలు లేకపోలేదు. పోడు దున్నుతున్న గిరిజన రైతుల అరకలు నిలిపివేసి, పోడు చుట్టూ కందకాలు తవ్విన ఘటనలు ఉన్నాయి. ఈ క్రమంలో ఫారెస్టోళ్లకు, పోడుదారులకు వాగ్వాదాలు సైతం జరిగాయి.



జేసీబీ యంత్రాన్ని అడ్డుకున్న పోడుదారులు (ఫైల్)



కరెంటు స్తంభాలను ధ్వంసం చేసిన దృశ్యం (ఫైల్)

ఈసారైనా పట్టాలివ్వాలి..



గతంలో ఫారెస్టోళ్లు, రెవెన్యూ వాళ్లు వచ్చి మా పోడు భూములను సర్వే చేశారు. ఇగ ఇస్తాం .. అగ ఇస్తాం అని చెప్పారు. మళ్లీ ఫారెస్టోళ్లే వచ్చి.. పోడు భూములను దున్ననియ్యకుండా అడ్డుకొని ఇబ్బందులు పెట్టారు. తాతా ముత్తాతల నుంచి పోడు చేసుకునే బతుకుతున్నాం. ఇప్పుడు కేసీఆర్ పోడు కోసం దరఖాస్తు చేసుకోండని చెబితే.. నాకున్న 5 ఎకరాల పోడుకు దరఖాస్తు చేసుకున్నా. ఈ సారైనా పెద్ద సార్లు కనికరించి పోడుపట్టాలు ఇస్తారని ఆశతో ఉన్నాం.

– గుగులోత్ మూనా, పోడు రైతు, పాటిమీదిగుంపు

కార్పొరేట్ల కనుసన్నల్లోనే కేంద్ర ప్రభుత్వం..



చెక్కు అందజేస్తున్న వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్

కారేపల్లి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కనుసన్నలో నడుస్తూ.. దేశ సంపదను దోచి పెడుతుందని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ మండిపడ్డారు. కారేపల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయలో శుక్రవారం బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దేశ రాజకీయాల్లోకి అడుగుపెట్టడం ప్రజలకు శుభపరిణామం అన్నారు. ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ జాతీయ మహసభతో బీజేపీకి భయం పట్టుకుందన్నారు. అనంతరం మాణిక్యారం, వడ్డెరగుంపులో ఇటీవల మృతిచెందిన ఉప్పతల రామన్న కుటుంబాన్ని పరామర్శించి, రామన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు ఉమాశంకర్, భన్సీలాల్, ఎంపీపీ శకుంతల, వైఎస్ ఎంపీపీ శ్రీనివాసరావు, సొసైటి అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మంగీలాల్, రైతుబంధు మండల కన్వీనర్ శ్రీను, సంత ఆలయ చైర్మన్ నాగేశ్వరరావు, సర్పంచ్ అజ్మీరా నాగేశ్వరరావు, మండల కోఆప్షన్ హనీఫ్, సత్యనారాయణ, తోటకూరి రాంబాబు, వీరన్న, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యకేంద్రం ప్రారంభం..

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో ఆయుర్వేద వైద్య ఉపకేంద్రాన్ని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ గుగులోత్ లక్ష్మీబాయి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. డాక్టర్ సాదియా, డాక్టర్ హసీనాల ఆధ్వర్యంలో నిర్వహించే ఆయుర్వేద ఉపకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ జైపాల్, వైస్ చైర్మన్ సీతారాములు, ఏఎంసీ చైర్మన్ రత్నం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అనాథలను ప్రభుత్వమే ఆదుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు

తల్లాడ: అనాథలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఎమ్మెస్పీ జిల్లా కోఆర్డినేటర్ ఏపూరి వెంకటేశ్వరరావు అన్నారు. తల్లాడలో శుక్రవారం అనాథ పిల్లల అరిగోస దీక్ష విజయవంతం కోసం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి 2015 జూన్ 23న అనాథలకు అమ్మ, నాన్న ప్రభుత్వమేనని చెప్పి ఏడు సంవత్సరాలు దాటినా పట్టించుకోవటం లేదన్నారు. ప్రతిపక్షాలు కూడా దీనిపై నోరు మెదపటం లేదన్నారు. అనాథ పిల్లలను పాలక ప్రభుత్వాలు ఆదుకోవాలని ఈ నెల 30న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద అనాథల అరిగోస దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెస్పీ నాయకులు దారెల్లి వెంకటేశ్వరరావు, అద్దంకి వెంకటేశ్వర్లు, కోటయ్య, సురేష్, శాంతయ్య, వెంకటేశ్వర్లు, అర్జున్, పుల్లారావు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం విజయవంతం

మధిర: చిలుకూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పశు వైద్య శిబిరం విజయవంతమైంది. మండల పశువైద్యాధికారి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని చిలుకూరు గ్రామ సర్పంచ్ నిడమానూరు సంధ్య ప్రారంభించారు. ఈ శిబిరంలో ఎదకురాని పశువులు, తిరిగిపొర్లే పెయ్యలు, చూడి పరీక్షలు, వ్యాధులకు చికిత్సలు అందించారు. లేగ దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు లక్ష్మణరావు, సిబ్బంది భారతి, గోపాలమిత్ర సురేష్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు..

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం శ్రీ ఆద్యా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రతి విద్యార్థి యొక్క రక్త గ్రూప్‌ను నిర్ధారించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆద్యా ఆస్పత్రి వైద్యుడు నారగాని రాంప్రసాద్, సర్పంచ్ షేక్ బీజాన్‌బీ, ఎస్ఎంసీ చైర్మన్ షేక్ షాజాహాన్, హెచ్ఎం చలపతిరావు, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గీతా మందిరం ప్రారంభం

మధిర: పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ సమీపంలో నూతనంగా నిర్మించిన వేణుగోపాలస్వామి గీతా మందిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ ఆలయంలో రాధాకృష్ణులు, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మధిర సొసైటీ అధ్యక్షుడు కృష్ణప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ వాసు, ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సతీమణి నందిని పాల్గొన్నారు. ఆమెను ఆలయ కమిటీ బాధ్యులు సాదరంగా ఆహ్వానించి రాధాకృష్ణుల చిత్రపటాన్ని అందజేశారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

ముదిగొండ: ఆటో డ్రైవర్ నిజాయితీగా వ్యవమరించి ఆటోలో మర్చిపోయిన నగదును మహిళకు అందించాడు. ముదిగొండ సెంటర్‌లో కమలాపురం వెళ్లేందుకు శుక్రవారం చిలుకూరి వెంకమ్మ ఆటో ఎక్కింది. ఈ క్రమంలో రూ.2,090 లు డబ్బులున్న కవర్‌ను ఆటోలో మర్చిపోయింది. దీంతో ఆటో డ్రైవర్ కుటుంభరావు గమనించి ఆ నగదును ముదిగొండ పోలీస్ స్టేషన్‌లో అప్పగించి ఆమెకు అందించాడు. దీంతో డ్రైవర్‌ను పోలీసులు అభినందించారు.

చినజీయర్‌కు పద్మభూషణ్ హర్షణీయం

సత్తుపల్లిరూరల్: ఆధ్యాత్మిక పునాదుల ఆధారంగా సమాజ సేవ చేస్తూ భారతీయ వైదిక సంప్రదాయాన్ని సంరక్షిస్తున్న త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామనుజ చినజీయర్ స్వామికి కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదు ప్రకటించడం హర్షణీయమని ప్రముఖ ప్రవచనకర్త శ్రీమాన్ రామకృష్ణమాచార్యులు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంకా నల్లాన్ చక్రవర్తుల సీతారామానుజాచార్యులు, శేషాచార్యులు, కేశవరెడ్డి, వెంకటేశ్వరరావు, కృష్ణ, శంకర్‌రావు, పురుషోత్తమరావు కూడా హర్షం వ్యక్తం చేశారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఏన్కూరు: చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మ కోరారు. మండలంలోని నాచారంలో అంగన్‌వాడీ–2 కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఇచ్చే భోజనాన్ని పరిశీలించారు. రిజిస్టర్ ప్రకారం నిల్వ ఉన్న సరుకులను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాసుల పంపిణీ

కల్లూరురూరల్: దివ్యాంగులకు సుప్రభా ఫౌండేషన్ సహకారంతో సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో శుక్రవారం చంద్రుపట్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో దివ్యాంగులకు ఉచిత బస్‌పాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రసాద్‌తో పాటు వార్డు మెంబర్ తిప్పారెడ్డి, రామనర్సింహారావు, పంచాయతీ కార్యదర్శి భాను యుగంధర్, పుర ప్రముఖులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తుపల్లి మార్కెట్‌లోకి హ్యుందాయ్ ఐ10



గ్రాండ్ ఐ10 నియాస్ కారును ఆవిష్కరిస్తున్న సీఐ కరుణాకర్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని హ్యుందాయ్ మోటార్ ఇండియా షోరూంలో కొత్త వర్షన్ గ్రాండ్ ఐటెన్ నియాస్ ఆరా కారును పట్టణ సీఐ టి.కరుణాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూం మేనేజర్ నర్రా సాయికుమార్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా హ్యాచ్‌బాక్ వాహనాలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకొని ఈ సరికొత్త మోడల్స్‌ను కంపెనీ మార్కెట్‌లోకి విడుదల చేసినట్లు తెలిపారు.

పేదల కళ్లలో సంతోషమే ప్రభుత్వ లక్ష్యం



వేంసూరు : కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

వేంసూరు: అన్ని వర్గాల పేదల కళ్లలో సంతోషాన్ని నింపేందుకు రాష్ట్రప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలుచేస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. ఈమేరకు మండలంలోని 51మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 24మందికి సీఎం రిలీఫ్ చెక్కులను మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కాగా, వేంసూరులో షాదీఖానా నిర్మాణానికి రూ.75 లక్షలు మంజూరు చేయించడంపై స్థానిక ముస్లింలు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మారోజు సుమలతతో పాటు దొడ్డ శ్రీలక్ష్మి, వెంకటకృష్ణారెడ్డి, గంధ్ర సోమిరెడ్డి, గొర్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు మండలంలో పర్యటన..

కల్లూరు: కల్లూరు మండలంలో శుక్రవారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పర్యటించారు. ఈ సందర్భంగా పలువురి వివాహ వేడుకలకు హాజరుకావడమే కాక, అనారోగ్యంతో బాధపడుతున్న వారి కుటుంబాలను పరామర్శించారు. జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, నాయకులు డాక్టర్ లక్కినేని రఘు, లక్ష్మణరావు, ఎం.డీ.ఇస్మాయిల్, ఎస్‌కే.కమ్లీ, పెడకంటి రామకృష్ణ, కొరకొప్పు ప్రసాద్, మేకల కృష్ణ, ధరావత్ మోహన్‌నాయక్, అంకిరెడ్డి అనూష, శ్రీనివాసరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా..



మున్సిపల్ చైర్మన్ మహేష్‌ను అభినందిస్తున్న కౌన్సిలర్లు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సహకారంతో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో మూడేళ్ల పదవీకాలం పూర్తైన సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్‌ను కౌన్సిలర్లు, అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధికి మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సండ్ర సహకారంతో కోట్లాది రూపాయల నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తున్నామన్నారు. సమావేశంలో కమిషనర్ కె.సుజాత, టీపీఓ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు మట్టా ప్రసాద్, గ్రాండ్ మౌలాలీ, ఎస్‌కే ఛాంద్‌పాషా, గుండ్ర రాఘవేందర్, విజయ నిర్మల, నడ్డి జమలమ్మ, మేకల భవాని, మల్లూరు పద్మావతి, రూత్ క్రిష్టియాన తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి



సత్తుపల్లి టౌన్: మాట్లాడుతున్న సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి

సత్తుపల్లిటౌన్: బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి అన్నారు. సత్తుపల్లిలోని బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో 'నారీశక్తి'మహిళా సాధికారికత అనే అంశంపై న్విహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. బాలికలు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉండేలా క్రమ శిక్షణ, పట్టుదలతో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో సత్తుపల్లి కోర్టు ద్వితీయ శ్రేణి జడ్జి జె.గోపాలరావు, కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ విజయకుమారి, భద్రాద్రిజిల్లా ప్రిన్సిపాల్ సెక్రటరీ రామలింగేశ్వరరావు, అడ్వకేట్ వెంకటేశ్వరరావు, డాక్టర్ స్రవంతి, విజయలక్ష్మి, నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి..

వైరా రూరల్: విద్యార్థినులు ఒక్క చదువులోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని ముసలిమడుగు ఎస్టీ గురుకులం ప్రిన్సిపాల్ సుఖఃభోగి నాగేంద్రమ్మ సూచించారు. మండలంలోని ఎస్టీ గురుకులంలో శుక్రవారం నిర్వహించిన వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. 10 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆడపిల్లల ఎదుగుదల, శారీరక ఆరోగ్యం, మానసిన అభివృద్ధి తదితరల అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ సీహెచ్.మేరీ, ఎస్.రమాదేవి, కె.శిరీష, జె.శిరీష, బి.నవ్య, పి.కవిత, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు ఆత్మరక్షణ అవసరం

ఏన్కూరు: ఆడపిల్లలకు ఆత్మరక్షణ అవసరం ఉండాలని ప్రధానోపాధ్యాయురాలు శైలా అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆడపిల్లలకు కరాటే శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడపిల్లలకు తమను తాము కాపాడుకునేందుకు కరాటే నేర్చుకోవాలన్నారు. ఆత్మరక్షణ కోసం కరాటే ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పలువురికి తమ్మినేని పరామర్శ

కొణిజర్ల: మండలంలోని మెకాలకుంట, లక్ష్మీపురం గ్రామాల్లో శుక్రవారం మృతి చెందిన వారికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం నివాళులు అర్పించారు. మెకాలకుంటకు చెందిన ధరావత్ చీన్యా లక్ష్మీపురం గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యుడు జట్ల రంగారావు మాతృమూర్తి జట్ల అమ్మతమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న తమ్మినేని ఆయా గ్రామాల్లోని మృతదేహాలను సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు వీరభద్రం, రాంబాబు, విక్రమ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసమే హాత్ సే హాత్ జోడో యాత్ర

వైరా: ప్రజల సంక్షేమం కోసమే హాత్ సే హాత్ జోడో యాత్ర చేపట్టారని టీపీసీసీ సభ్యుడు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం వైరాలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చే వరకు కార్యకర్తలు అలుపెరగని పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దానియేలు, వీరయ్య, అశోక్, రాము, శ్రీను, సుమన్, కిరణ్, కిషోర్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ గవర్నర్‌గా నామినేషన్ వేసిన మధు



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నంబూరి మధు

వైరా: లయన్స్‌క్లబ్ వీడీజీ–2 గవర్నర్‌గా వైరాకు చెందిన జిల్లా సెక్రటరీ కమ్యూనిటీ సర్వీసెస్ ఛార్టర్ నంబర్ నంబూరి మధు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు లయన్స్‌క్లబ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ మేరకు నామినేషన్ కమిటీ చైర్మన్ జగనీ బీమయ్యకు మధు రెండు సెట్ల నామినేషన్ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా తనకు మద్దతు పలికినందుకు ఆయన వైరా క్లబ్ సభ్యులకు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, అధ్యక్షుడు నాగేశ్వరరావు, వెంకటేష్, మిట్టపల్లి నాగేశ్వరరావు, ప్రభాకర్, విశ్వేశ్వరరావు, రామారావు, సునీత, అన్నపూర్ణ, విజయరాణి, నాగమల్లేశ్వరి, మణికుమారి, రజని, నీరజ, హనుమాయమ్మ, ఇంద్రాణి, సీత, శ్రీనివాసరావు, ప్రసాద్, సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సత్తుపల్లిరూరల్: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఆనాడు యూపీఏ–1 గవర్నమెంట్ వామపక్షాల మద్దతు ఏర్పాటైన సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని నిర్మాణ కార్మికుల కోసం తీసుకురావటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్మికశాఖ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, మండల కార్యదర్శి కర్నాటి బసవయ్య, భవన నిర్మాణ సంక్షేమబోర్డు సత్తుపల్లి మండల అధ్యక్షుడు వల్లూరి శ్రీను, కార్యదర్శి శ్రీనివాసరావు, యేసు, ఉదయలక్ష్మి, వీరబాబు పాల్గొన్నారు. .

ధర్నాను విజయవంతం చేయండి..

సత్తుపల్లిటౌన్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఫిబ్రవరి 1న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఎ.శరత్ పిలుపు నిచ్చారు. శుక్రవారం సత్తుపల్లిలో ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగరాజు, బాలకృష్ణ, హనుమంతు, కిరణ్‌కుమార్, వీరస్వామి పాల్గొన్నారు.